సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి

అగనంపూడి: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పసిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని లీఫార్మా కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి అన్నారు. దువ్వాడ వీఎస్‌ఈజెడ్ ఆవరణలోని లీఫార్మా కంపెనీ పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా దువ్వాడ సెక్టార్-1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 40 మంది బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. బాలింతలు పిల్లల ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జయలక్ష్మి, అంగన్వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ ఉమా మహేశ్వరరావు

గాజువాక: గతనెల 25 నుంచి 29వ తేదీ వరకు హర్యానాలో నిర్వహించిన 43వ సబ్ జూనియర్ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో గాజువాక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల సీఈసీ విద్యార్థి ఆర్.తులసీ పైడయ్య ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం అతడిని కళాశాల కరస్పాండెంట్ టి.ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ బి.ప్రసాదరావు అభినందించారు. తమ విద్యార్థులు క్రీడాల్లో రాణించడానికి అవసరమైన సదుపాయాలు తమ కళాశాలలో ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### కార్మికుల్లో భయాందోళనలు తొలగించాలి



మాట్లాడుతున్న బొడ్డు పైడిరాజు

అగనంపూడి: కేంద్ర ప్రభుత్వం వైఖరి, ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యధోరణి వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, యు.రామస్వామి, పరంధామయ్య అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో 1,330వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కార్మిక ప్రతినిధులతో కనీసం చర్చించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటుందన్నారు. దీని వల్ల ఆర్థిక నష్టం కల్గించడంతోపాటు మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్‌లో అశాంతి, అలజడలకు కేంద్ర ప్రభుత్వ పెద్దలతోపాటు యాజమాన్యం కూడా పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సిటూ నాయకులు గంగాధర్, పెదిరెడ్ల నీలకంఠం, వి.ప్రసాద్, ఆర్.వెంకట్రావు, దత్తాత్రేయరాజు, భానుమూర్తి, మధు పాల్గొన్నారు.

### 6న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం

మద్దిలపాలెం: ఈ నెల 6న ఉదయం 10 గంటలకు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ హాల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. సొసైటీలో కొత్తగా చేరాలనే వారు కూడా పాల్గొనవచ్చని చెప్పారు. గోవా ఫిల్మ్ ఫెస్టివల్ డెలిగేట్స్ ఎన్నిక ఈ సమావేశంలో జరుగుతుందన్నారు. వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
✆ 7997958388, 9912440606

# ప్రణవ రూపిణి.. శక్తి స్వరూపిణి

ఓంకార రూపిణి, శక్తి స్వరూపిణి కనకదుర్గాదేవి గురువారం బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల ప్రారంభవేళ అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.



బర్మాకాలనీలోని ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



బాల త్రిపురసుందరిగా అగనంపూడి కూడలిలోని దుర్గాలమ్మ



87వ వార్డులో దుర్గాదేవి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఉక్కునగరం: దసరా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీమహాలక్ష్మి, శ్రీమహాదుర్గ, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఒకే మంటపంలో కొలువుదీరిన అరుదైన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల మొదటిరోజుగురువారం శ్రీమహాదుర్గ అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో బాలా త్రిపుర సుందరి అవతారంలో, శ్రీమహాలక్ష్మి అమ్మవారు కాఫీ వర్ణం చీరలో ఆదిలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారు తెలుపు వర్ణం చీరలో భారతీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

అగనంపూడి: 87వ వార్డు మీ సేవా గ్రౌండ్స్, గవర వీధి, బొట్టవానిపాలెం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ప్రగడ శ్రీను, చిత్రాడ రమణ, ఆడారి శ్రీను, కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కణితి నిర్వాసిత కాలనీలో పూజల్లో పాల్గొన్న కోమటి శ్రీనివాసరావు దంపతులు



పెదమడకలోని మాతా దుర్గా భవానీ ఆలయంలో భవానీలకు భిక్షను వడ్డిస్తున్న పూర్ణ

- వడ్లపూడి, కణితిలోని గవర వీధి, యాదవ వీధి, మీ సేవా గ్రౌండ్స్, యాత వీధి, రజకుల వీధి, లక్ష్మీపురం కాలనీ, అప్పికొండ కాలనీ, పాత వడ్లపూడిల్లో నిర్వహించిన ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో అవిరెడ్డి సూర్యనారాయణ, బొట్ట అప్పలస్వామి, వడ్లపూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- 85వ వార్డు పెదమడక సూదికొండపై వెలిసిన మాతా దుర్గా భవానీ ఆలయంలో ధర్మకర్త బల్ల పైడిరాజు దంపతులు పూజలు నిర్వహించారు. భవానీలకు గురుమాత కరణం లక్ష్మి అప్పారావు దంపతుల సహకారంతో భిక్ష ఏర్పాటుచేశారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ పాల్గొన్నారు.
- అగనంపూడి, దిబ్బపాలెం, శనివాడ, గ్లవాని పాలెం, కొండయ్యవలసల్లో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అగనంపూడి దుర్గాదేవి ఆలయంలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి బృందం లలిత సహస్రనామ పారాయణం చేశారు.

పెదగంట్యాడ: 75వ వార్డు ధర్మాల వీధిలో పెంటమాంబ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని 75వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి మహేశ్వరరెడ్డి, అప్పలరెడ్డి, పిట్ట రమణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు గొందేశి సుమన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, బొట్ట అప్పలరెడ్డి పాల్గొన్నారు.



ఎల్వీ నగర్ ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ

- 76వ వార్డులో కొలువుదీరిన దుర్గమ్మను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు దర్శించుకున్నారు. కార్యక్రమంలో జీలకర్ర రమణ, భువనేశ్వరి, ములకపల్లి ఈశ్వరరావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.
- బర్మాకాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు.
- 75వ వార్డు మునలినాయుడు పాలెంలో వంశీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గమ్మ మండపం వద్ద గాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వంశీకృష్ణ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: శరన్నవరాత్రులను పురస్కరించుకుని 68, 69 వార్డుల్లోని పలు చోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూజల్లో వైఎస్సార్ సీపీ నగర ప్రధానకార్యదర్శి సంద్రాన నూకరాజు, సాయి శర్వాణి పాఠశాల కరస్పాండెంట్ మౌళి, కార్పొరేటర్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**త్రిశక్తి ఆలయంలో చండీయాగం**

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు, నవ చండీ యాగాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, యాగ దీక్షా ధారణల అనంతరం నవచండీ మండపారాధన, కలశ స్థాపన, చండీ పారాయణలు జరిగాయి. అనంతరం ముగ్గురమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం రుత్వికులు శ్రీమహా గణపతి నవగ్రహ సహిత నక్షత్ర హోమాలు, నవ చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**బాలత్రిపుర సందరిగా దుర్గాలమ్మ**

అగనంపూడి: అగనంపూడి కూడలిలోని శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ మాట్లాడుతూ విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో మాదిరిగా ఇక్కడ అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

గాజువాక: 67వ వార్డు గాజువాక హైస్కూల్ రోడ్‌లోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక మండపంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, నాయకులు ఎస్.ఎం.డి.గౌస్, పల్లా పెంటారావు, పైడిరాజు, రవి, మహేష్, భూషణ్, నరేష్, లక్కీ, కుమార్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

- ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు.



బాలా త్రిపుర సుందరి అవతారంలో శ్రీ మహాదుర్గ



ఆదిలక్ష్మిగా శ్రీ మహాలక్ష్మి



భారతీ దేవి అలంకరణలో శ్రీ మహా సరస్వతి



68వ వార్డులో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు



అక్కిరెడ్డిపాలెంలోని దుర్గాదేవి మండపంలో కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు



గాజువాకలో ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి



ధర్మాల వీధిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మహేశ్వరరెడ్డి తదితరులు

## రాజా సేవలు మరువలేనివి



రాజా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



రాజాకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: మున్సిపల్ మాజీ చైర్మన్‌గా గాజువాక అభివృద్ధికి రాజా ఎనలేని కృషి చేశారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్ వి.వి.ఎస్.ఎం.రాజు (రాజా) సంస్మరణ సభను శివాజీనగర్‌లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ రాజా ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నాయకునిగా పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముందుగా రాజా సోదరుడు బుజ్జి, కుమారుడు నిశాంత్ వర్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకట్రామయ్య, వుడా మాజీ చైర్మన్ రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, దామా సుబ్బారావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, షౌకత్ అలి, బొండా జగన్, రౌతు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు చొప్పా నాగరాజు, ఉరుకూటి అప్పారావు, నాయకులు కొయ్య ప్రసాద్‌రెడ్డి, పి.సతీష్‌వర్మ, మంత్రి రాజశేఖర్, భూపతిరాజు శ్రీనివాసరాజు, పూర్ణ, వాడపల్లి రామచంద్రరాజు, పెప్సీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కోత విధించిన సొమ్ము ఖాతాల్లో జమ చేయాలి



వడ్లపూడి సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

అగనంపూడి: జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి ఆదాయ పన్ను కోసమంటూ కోత విధించిన మొత్తాలను వెంటనే బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. 87వ వార్డు వడ్లపూడి వార్డు సచివాలయం వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరెవరి ఖాతా నుంచి ఎంతెంత వసూలు చేశారో వెంటనే సదరు మొత్తాలను జమ చేయాలని, మృతి చెందిన , అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, గత రెండేళ్లలో కార్మికులకు మధ్య మధ్యలో చెల్లించకుండా ఉంచిన జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కోస్‌లో విలీనం అయినా నేటికి చాలామందికి పాత జీతాలే అందుతున్నాయని వెంటనే సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గణేష్, నాగరాజు, రామారావు, దమయంతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించండి

**పోరాట కమిటీ నాయకుల విజ్ఞప్తి**



స్టీల్‌ప్లాంట్ ఈడీ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. ఉక్కు సీఎండీ ఎ.కె. సక్సేనా, డైరెక్టర్లతో గురువారం జరిగిన పోరాట కమిటీ నాయకులు సమావేశంలో విజ్ఞప్తి చేశారు. ఉక్కు కార్మికులకు వేతన సవరణ జరగక పోవడం వల్ల ప్రతీ నెలా వేలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. దీనికి తోడు ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర అనేక సదుపాయాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు ఉన్న హెచ్‌ఆర్‌ఏను కూడా తొలగిస్తే కార్మికులు మరింత నష్టపోతారన్నారు. కార్మికుల ఆర్థిక పరిస్థితిపై పునరాలోచించి హెచ్‌ఆర్‌ఏను కొనసాగించాలన్నారు. అంతకుముందు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద హెచ్‌ఆర్‌ఏ అంశంపై ధర్నా చేశారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమావేశంలో డైరెక్టర్లతో పాటు నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, గణపతిరెడ్డి, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు భానోజీతోటలో రూ.39 లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోడ్డు ఛిద్రం కావడంతో కొత్త రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్వర్ణ 'సాహితి'

**అంతర్జాతీయ ఈత పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థినికి మూడు బంగారు పతకాలు**



సాహితీకి స్వర్ణ పతకాలు అందిస్తున్న సింగపూర్, మలేషియా దేశ నిర్వాహకులు (ఫైల్)

అగనంపూడి: అంతర్జాతీయ ఈత పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సత్తా చాటింది. మూడు స్వర్ణాలతో దేశ పతాకను ఎగురవేసింది. గత నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సింగపూర్, మలేషియా సంయుక్తంగా పదో అంతర్జాతీయ ఈత పోటీలు నిర్వహించాయి. సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ సారథ్యంలో భారతదేశం నుంచి పలువురు విద్యార్థులు పాల్గొనగా, దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విద్యార్థి కె.సాహితి వంద మీటర్లు, యాభై మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగాల్లో సత్తా చాటి మూడు స్వర్ణాలు చేజిక్కించుకుంది. ఈమేరకు కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే మహిళలు, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో క్రీడా ప్రతిభను చాటుకొంటున్నారన్నారు. సాహితీ మూడు స్వర్ణాలతో కళాశాల ప్రతిభను ఇనుమడింపజేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## జెడ్సీ దృష్టికి గాజువాక సమస్యలు



జెడ్సీ శేషాద్రితో వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక: గాజువాకలో వివిధ సమస్యలను వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి వివరించారు. జెడ్సీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాజువాకలో గల పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లు, పెన్షన్, అమ్మ ఒడి వంటి పథకాల్లో కోతలేకుండా కొనసాగించడంతోపాటు కొత్త పథకాలను అర్హులందరికీ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పెదగంట్యాడ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. జెడ్సీని కలిసినవారిలో నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, కటికల కల్పన, సంపంగి ఈశ్వరరావు, అండిబోయిన అప్పారావు, పిట్టా రెడ్డి, బొడ్డ గోవింద్, దరిగి రవి, ములకలపల్లి వెంకటేష్, కాకినాడ పెంటారావు, ధర్మపురి చక్రి, పల్లా పెంటారావు, కటికల ప్రభాకర్ తదితరులున్నారు.

## బతుకమ్మ సంబరాలు ప్రారంభం



ఉక్కునగరంలో బతుకమ్మ సంబరాల్లో తెలంగాణ ఉద్యోగుల కుటుంబాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు సెక్టార్-8 మహాత్మా గాంధీ పార్కులో ప్రారంభమ య్యాయి. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ సంబరాల్లో భాగంగా తెలంగాణ ఉద్యోగుల కుటుంబాలు వివిధ పూలతో బతుకమ్మలు పేర్చి ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వైభవాన్ని చాటిచెప్పారు. స్టీల్‌ప్లాంట్ జీఎం ఎస్. కుమారస్వామి, ముఖ్య సలహాదారు, జీఎం ఎస్. వీరేశం, ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడుతూ ఏటా ఉక్కునగరంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మూడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా మురళీధరరెడ్డి, ఎస్. వీరేశంలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి. వెంకటేశ్వర్లు, ఎస్. నర్సింగరావు, జి.మల్లేశం, ఎం.వేణుగోపాల్, ఎస్.బలరాం, చంద్రకిరణ్, టి.ప్రభాకర్, సీహెచ్. రవికుమార్, ఎ.శంకర్, భిక్షం, శశికాంత్‌లు పాల్గొన్నారు.

## డ్రైనేజీలు అస్తవ్యస్తం.. ప్రజలు సతమతం

- మురుగుపారే దారిలేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



అస్తవ్యస్తంగా అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక వద్ద డ్రైన్



భెల్ సిగ్నల్ పాయింట్ రాంనగర్ సర్వీసు రోడ్డు పక్కన పూడికతో అస్తవ్యస్తంగా డ్రైను



వ్యర్థాలతో నిండిన బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద డ్రైన్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69వ వార్డులో పలు చోట్ల డ్రైన్లు అస్తవ్యస్తంగా మారాయి. పూడికలతో నిండి పోతున్నాయి. భారీ వర్షాల కురిసినప్పుడల్లా డ్రైన్లు పొంగి రహదారులపై మురుగు చేరుతుంది. దీంతో తీవ్ర దుర్గంధం, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక వద్ద డ్రైను వివాదాల కారణంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. మురుగు పారే దారి లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద రాంనగర్ సర్వీసు రోడ్డు పక్కనున్న డ్రైను అభివృద్ధికి నోచుకోకుండా కోతకు గురైంది. డ్రైను పూర్తిగా శిథిలావస్థకు చేరి పూడికతో నిండిపోయింది. ఆటోనగర్ రాంనగర్ ఏ-బ్లాక్‌లోని చేపలు, మటన్ వ్యాపారాలు సాగిస్తున్న దుకాణాల ముందు భారీ మురుగు కాలువ అధ్వానంగా మారింది. చేపలు, మటన్ కొనుగోలుకు షీలానగర్ నుంచి గాజువాక వరకు వినియోగదారులు వస్తుంటారు. కొనుగోలుదారులు మురుగు కాలువ వల్ల అసౌకర్యానికి గురవుతున్నారని వ్యాపారులు తెలిపారు. జీవీఎంసీ 69వ వార్డు బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద డ్రైను పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ వద్ద డ్రైను పరిస్థితి అంతే...ఈ డ్రైను ద్వారా మురుగునీరు సరాసరి ఇళ్లల్లోకి వచ్చే పరిస్థితి ఉంది. డ్రైన్లను అభివృద్ధి చేపట్టకపోతే భారీ వర్షాలకు రోడ్లు, పలు ప్రాంతాల నివాసాల వారు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

**కాలువలపై దృష్టి సారించాలి**

జీవీఎంసీ 68వ వార్డు పరిధిలో పెద్దా, చిన్నా మురుగు కాలువలు ఎన్నో ఉన్నాయి. పూడికలతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాలు పడుతున్న సమయంలో కాలువలు నిండిపోయి మురుగు రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. దీంతో తీవ్ర దుర్గంధంతో దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మురుగు కాలువల అభివృద్ధిపై దృష్టి సారించాలి. –వెంకటరావు, మింది

**ఇబ్బంది పడుతున్నాం**

పలుచోట్ల మురుగుకాలువలు పూడికలతో నిండిపోయాయి. రాంనగర్ వద్ద చేపలు, మటన్ వ్యాపారాల దుకాణాల ముందు డ్రైనేజీ దారుణంగా ఉంది. మురుగు పారే అవకాశం లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలంలో అక్కడ అడుగుకూడా పెట్టలేని పరిస్థితి. అధికారులు దృష్టి సారించాలి.

–వెంకటేశ్వరరావు, నాతయ్యపాలెం